
ఈనాడు
పల్నాడు
సోమవారం అక్టోబరు 7, 2024

దేవీరూపం.. దేదీప్యమానం


పిడుగురాళ్లలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

దసరా శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధరూపాల్లో జగన్మాత కనువిందు చేస్తున్నారు. ఆలయాల వద్ద కుంకుమ పూజలు, హోమాలు, కోలాటాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.
– న్యూస్‌టుడే, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ


కోలాటమాడుతున్న మహిళలు


సత్తెనపల్లి: కొత్తపేటలో అలంకరణ


వినుకొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజ

పురుగు మందుల అమ్మకాల నిలిపివేత

వినుకొండ రూరల్, వినుకొండ: రికార్డులు సక్రమంగా నమోదు చేయని పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేస్తున్నట్లు వినుకొండ మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి తెలిపారు. 'అక్షరంతో ఏమార్చి.. అన్నదాతను దోచేసి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన వ్యవసాయాధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. వినుకొండలోని వెన్నపూస కాలనీలో బయో మందుల తయారీతో పాటు అమ్మకాలు జరిపే కిసాన్ అగ్రి టెక్నాలజీ యూనిట్, ఆ దుకాణంలో తనిఖీలు చేశారు. నిల్వ ఉన్న మందులకు, రికార్డులకు పొంతన లేకపోవడంతో రూ. 3,13,968 విలువైన బయో మందుల అమ్మకాలు నిలిపేసినట్లు ఏవో తెలిపారు.

జిల్లాలో ఇసుక కొరత లేదు : కలెక్టర్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని సమర్థంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేదని, 7 నుంచి 11 వరకు 5 వేల టన్నులకు అనుమతులు ఇచ్చామని, ఇంకా 11,511 టన్నులు నిల్వ ఉందని తెలిపారు. జిల్లాలో ఆరు చోట్ల రీచ్‌లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అమరావతి మండలంలో నాలుగు, అచ్చంపేట మండలంలో రెండు ఉన్నాయని, అక్కడ యంత్రాలతో కాకుండా మనుషులతోనే ఇసుక సేకరిస్తామని చెప్పారు. ఆయా చోట్ల 4.20 లక్షల మెట్రిక్ టన్నులు లభ్యమవుతోందని, అంతేకాకుండా డీసిల్టెడ్ ఇసుక మరో 5 లక్షల టన్నుల మేర ఉందన్నారు. జల వనరుల శాఖ అనుమతులు వస్తే అక్కడ కూడా ఇసుక సేకరిస్తామన్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితంగానే ఇస్తుందని, సేకరణ, యార్డులకు తరలింపునకు అయిన వ్యయంతో పాటు జీఎస్టీ కలిపి ఇసుక అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రవాణా వ్యయం లబ్ధిదారులే భరించాలని సూచించారు. ఇసుక విధానానికి జిల్లాలో జేసీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్దకు రోజుకు 50 వాహనాలను మాత్రమే అనుమతిస్తామని, ఆన్‌లైన్‌లో అనుమతి పొందిన వారు వచ్చి ఇసుక తీసుకెళ్లవచ్చని, లబ్ధిదారులు అనుమతించిన సమయంలోనే రావాలని చెప్పారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పక్కన ఎస్పీ శ్రీనివాసరావు

పెదబావిలో ఈతరం

దాచేపల్లి మండలం తంగేడలోని పెద్దబావి జలంతో కళకళలాడుతోంది. గ్రామంలోని శివాలయం వద్ద ఉన్న ఈ పురాతన బావి గత రెండేళ్లు వర్షాలు లేక అడుగంటింది. ఇటీవల కురిసిన వర్షాలకు బావి పూర్తిగా నిండింది. పెద్ద కొలనులా విశాలంగా ఉండే ఈ బావిలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన పిల్లలు పెద్దలతో కలిసి ఈత కొడుతున్నారు. – ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, దాచేపల్లి



ఆపదలో రక్తం అందేలా..
బాధితుల ప్రాణాలు నిలిపేలా..

❖ కాంపోనెంట్ బ్లడ్‌బ్యాంకుకు అనుమతులు
❖ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రూ.2కోట్లతో రక్తనిధి కేంద్రం ఏర్పాటు

న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

పల్నాడు జిల్లాలో కాంపోనెంట్ బ్లడ్‌బ్యాంకు ప్రారంభంకానుంది. ప్రభుత్వ వైద్యశాలలో రూ.2 కోట్ల వ్యయంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు ప్రభుత్వపరంగా లాంచనాలు పూర్తయ్యాయి. కొత్త వైద్యశాల భవనంలో 2022 నవంబరులో 3వేల చదరపు అడుగుల స్థలాన్ని రెడ్‌క్రాస్‌కు కేటాయించారు. ఇందులో రక్తనిధి కేంద్రానికి అవసరమైన ప్రయోగశాలలు, రక్తం నిల్వకు ఏర్పాట్లు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రధాన కేంద్రం నుంచి రూ.కోటి విలువైన పరికరాలు మంజూరు చేసి పంపారు. మిగిలిన మొత్తాన్ని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ దాతల నుంచి సేకరించింది. ఇటీవల కేంద్ర ఔషధ నియంత్రణ పరిపాలక శాఖ బ్లడ్ బ్యాంకుకు అనుమతి ఇచ్చింది.


ప్రయోగశాల

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో నరసరావుపేటలో బ్లడ్‌బ్యాంకుతో పాటు మరో ఆరు రక్తనిల్వ కేంద్రాలు ఉన్నాయి. మాచర్ల, అమరావతి, గురజాల, వినుకొండ, సత్తెనపల్లి, చిలకలూరిపేటలోని ప్రభుత్వ వైద్యశాలలకు అవసరమైన రక్తాన్ని నరసరావుపేట నుంచి పంపి అక్కడ నిల్వ చేస్తారు. అయితే జాతీయ రహదారులు, ప్రమాదాలకు అవకాశం ఉన్న నేపథ్యంలో రక్తం కొరతను నివారించేందుకు మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేటల్లో బ్లడ్‌బ్యాంకుల ఏర్పాటుకు వైద్యాధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటి వరకు రక్తం అందుబాటులో లేక గుంటూరు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కొత్తగా ఏర్పాటు చేసే రక్తనిధి కేంద్రంలో 1000 యూనిట్ల రక్తం, కాంపోనెంట్స్ నిల్వ చేసే అవకాశం ఉంది. అందుకు అవసరమైన శీతలీకరణ పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

బహుళ ప్రయోజనాలు

నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో కాంపోనెంట్ బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు రెడ్‌క్రాస్ సొసైటీ ముందుకురావడంతో ప్రజలకు మేలు జరగనుంది. రక్తం నుంచి ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్లు, ప్లాస్మా, ఫ్యాక్టర్ 8 అనే కాంపోనెంట్స్ ఉంటాయి. వాటిని వేరు చేయడం ద్వారా ఒక యూనిట్ నుంచి నలుగురు రోగుల అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంది. డెంగీ వంటి విషజ్వరాలకు ప్లేట్‌లెట్లు, హిమోఫీలియా రోగులకు ఫ్యాక్టర్ 8 అనే పదార్థం, తలసీమియా వ్యాధిగ్రస్థులకు ఎర్ర రక్తకణాలు ఎక్కించాల్సి ఉంటుంది. ఇలా కాంపోనెంట్ బ్లడ్ బ్యాంకుతో రక్తాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఈ కేంద్రం నుంచి 30 శాతం రక్త నిల్వలు ప్రభుత్వ వైద్యశాలకే ఇస్తారు.


రక్తనిధి కేంద్ర ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రక్తం అవసరమయ్యే బాధితులకు మేలు

జిల్లాలో ఆరోగ్యస్థితి ప్రమాదకరంగా ఉండి నిర్ణీత గడువులో రక్తంలోని కాంపోనెంట్ అవసరమయ్యే వారు ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే వ్యాధితో బాధపడే వారు 391 మంది ఉన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులకు డయాలసిస్ చేయించుకునేవారు 249 మంది ఉన్నారు. రక్తహీనత, సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు 14 మంది, హిమోఫీలియా సమస్య ఉన్న వారు 73 మంది ఉన్నారు. ఆయా వ్యాధులకు ప్రైవేటుగా చికిత్స పొందేవారు అదే సంఖ్యలో ఉంటారని వైద్యులు చెబుతున్నారు. కొత్త బ్లడ్ బ్యాంకుతో బాధితులకు మేలు.

త్వరలో రక్తనిధి కేంద్రం అందుబాటులోకి..



రక్తనిధి కేంద్రం త్వరలోనే ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తాం. ఇప్పటికే ప్రయోగశాలలు, రక్తం నిల్వకు పరికరాలు అమర్చాం. అనుమతులు లభించిన తరుణంలో మరో రూ.10 లక్షల వ్యయంతో అవసరమైన కంప్యూటర్లు, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తాం. త్వరలోనే ప్రజలకు పూర్తిస్థాయిలో రక్తనిధి కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తాం.
- డాక్టర్ కేజే మోహన్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షుడు

ప్రకృతి వ్యవసాయం భేష్


పెదకూరపాడులో రైతు అమ్ముల్య పొలంలో పత్తి పంటను పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధులు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: అన్ని గ్రామాల్లో స్వయం సహాయక సంఘ మహిళలు ప్రకృతి వనరుల కేంద్రం ఏర్పాటు చేసి, రైతులకు మనజీవామృతంతోపాటు కషాయాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి తెలిపారు. ఆదివారం నాగిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో అమెరికా స్పెయిన్ విదేశీ బృందంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు విజయ్ కుమార్ సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు, బీజామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం మహిళా రైతు జ్యోతి ఏటీఎం పద్ధతిలో చేపట్టిన 27 రకాల కూరగాయలు, ఆకు కూరలు, దుంప, తీగ, పూల జాతి పంటల సాగు గురించి తెలుసుకున్నారు. కంది ఏ గ్రేడ్ మోడల్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెదేపా కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, బాబు, అదనపు డీపీఎం ప్రేమ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి(రాజుపాలెం): రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లిలో రైతు మల్లికార్జున రావు సాగు చేసిన పంటలను విదేశీ బృందం సభ్యులు పరిశీలించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగించకుండా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి వస్తుందని రైతు వారికి వివరించారు.

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతో బాగున్నాయని అమెరికా, స్పెయిన్ దేశాలకు చెందిన పలువురు ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం పెదకూరపాడులో పర్యటించిన బృంద సభ్యులు పత్తి, అంతర పంటలను పరిశీలించారు.

చెత్త పన్నుకు చెల్లు

22 నెలల్లో రూ.25.45 కోట్లు వసూలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

చెత్త పన్నుకు చెల్లుచీటి పాడుతూ గాంధీ జయంతి రోజున కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పట్టణాలను అపరిశుభ్రంగా.. అధ్వానంగా మార్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెత్త సేకరణకు యూజర్ ఛార్జీల పేరిట ప్రజలపై భారం వేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం తీసుకోని చెత్త నిర్ణయాన్ని అమలుచేసి అన్నివర్గాల నుంచి వ్యతిరేకతను జగన్ ప్రభుత్వం మూటగట్టుకుంది. పౌరసేవలకు ముడిపెట్టి చాలా చోట్ల నిర్బంధంగా వసూళ్లు చేశారు. చివరకు సామాజిక భద్రతా పింఛన్లతోపాటు ప్రభుత్వ పథకాల లబ్ధికి ముడిపెట్టారు. దీంతో చెత్త పన్ను నుంచి తప్పించుకునేందుకు సామాన్యులకు మరో మార్గం లేకుండాపోయింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ భారం నుంచి శాశ్వతంగా విముక్తి కలిగిస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.

విమర్శలొచ్చినా..: 2022 జూన్ నుంచి 2024 మార్చి వరకు చెత్త పన్ను వసూలు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నరసరావుపేట, బాపట్ల, తెనాలి, చిలకలూరిపేట, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్లలో వైకాపా ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసింది. ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.60, బహుళ అంతస్తుల్లో నివాసముండే వారి నుంచి రూ.90 చొప్పున వసూలు చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల ఆటోలు పెట్టి వాటికి పన్ను చెల్లించాలంటూ ఆదేశాలిచ్చారు. రోజువారీ వసూళ్ల లక్ష్యాల్ని కూడా నిర్దేశించి హడావుడి చేశారు. పేద కుటుంబం ఏడాదికి చెత్త పన్ను రూపంలో రూ.720 చెల్లించడం కష్టంగా మారింది. గడపకు గడపకు మన ప్రభుత్వం పేరుతో వైకాపా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తమవద్దకు వచ్చినప్పుడు చెత్తపన్ను చెల్లించలేకపోతున్నామని రద్దు చేయాలని సామాన్యులు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. సర్వత్రా విమర్శలొచ్చినా వైకాపా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు.

పట్టణాల వారీగా చెత్తపన్ను వసూళ్ల లక్ష్యం, తగ్గనున్న భారం ఇలా..

పట్టణం	చెత్త సేకరించే ఆటోలు	చెత్త సేకరణ పన్ను (రూపాయల్లో) నెలకు	ఏడాదికి
నరసరావుపేట	24	15,86,688	1,90,40,256
చిలకలూరిపేట	27	17,85,024	2,14,20,288
బాపట్ల	20	13,22,240	1,58,66,880
తెనాలి	41	27,10,592	3,25,27,104
మంగళగిరి, తాడేపల్లి	63	41,65,056	4,99,80,672

రూ.కోట్లు పిండేశారు

చెత్తపన్ను పేరిట పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి జగన్ ప్రభుత్వం కోట్లు పిండేసింది. పన్ను చెల్లించకుంటే పౌరసేవలు నిలుపుదల చేస్తామని సచివాలయ ఉద్యోగుల నుంచి హెచ్చరికలు రావడంతో చేసేదేమిలేక ప్రజలు పన్ను చెల్లించారు. 2022 జూన్ నుంచి 2024 మార్చి వరకు 22 నెలల్లో రూ.25.45 కోట్లు చెత్త పన్ను పేరిట ప్రజల నుంచి వసూలు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చెత్తపన్ను వసూళ్లు ఆగిపోయాయి. అభ్యంతరాలతో వసూళ్లు చేపట్టినా ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది.

కన్యకాంబకు వెండి ఆభరణాల బహూకరణ


కన్యకాంబకు శంఖు, చిలక హస్తం అందిస్తున్న మాస్టర్ మైండ్ డైరెక్టర్ మట్టుపల్లి సత్యసూర్య ప్రకాశ్, శ్రీలక్ష్మి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడులో కొలువైన త్రిశక్తి పీఠం వాసవి కన్యకాంబకు మాస్టర్ మైండ్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి సత్యసూర్య ప్రకాశ్, శ్రీలక్ష్మి దంపతులు ఆదివారం కిలోన్నర వెండి వస్తువులు బహూకరించారు. శంఖు, చిలక హస్తాలు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

మద్యం దుకాణాలకు 618 దరఖాస్తులు

49 చోట్ల ఒక్కటీ రాలేదు


వివరాలు వెల్లడిస్తున్న డీసీ శ్రీనివాసులు, ఈఎస్ అరుణకుమారి, ఏసీ రవికుమార్‌రెడ్డి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జోన్ పరిధిలోని గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 256 మద్యం దుకాణాలకు ఆదివారం వరకు 618 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ ఉప కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ శాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ) రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణ కుమారితో కలిసి ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 127 దుకాణాలకుగాను ఇప్పటివరకు 112 చోట్ల 394 దరఖాస్తులు వచ్చాయి. 15 దుకాణాలకు ఒక్క దరఖాస్తూ రాలేదు. పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయగా 92 చోట్ల 224 దరఖాస్తులు వచ్చాయి. 37 చోట్ల ఒక్క దరఖాస్తురాలేదని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దరఖాస్తులను సులువుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఎక్సైజ్ పోలీసు స్టేషన్లలోనూ దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుంది. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా, ఎన్ని దరఖాస్తులైనా దాఖలు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ నెల 11వ తేదీన వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో దుకాణాల ఎంపిక జరుగుతుందని డీసీ చెప్పారు.

వరికపూడిశెల నిర్మాణమే లక్ష్యం


ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే వెనుకబడిన వెల్దుర్తి మండలంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎంపీ లావు కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. వరికపూడిశెల పథకం నిర్మాణం తన బాధ్యత అని అన్నారు. ఉప్పలపాడు గ్రామంలో రూ.1.76 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎంపీతోపాటు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో మొక్క నాటారు. దుర్గి నుంచి ఉప్పలపాడు వరకు 17.6 కిలో మీటర్ల రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరికపూడిశెల జలసాధన సమితి కమిటీ సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ వరికపూడిశెల పథకానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్, తెదేపా రాష్ట్రప్రధాన కార్యదర్శి కళ్లంరాజ మాంజిరెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి.. సత్తా చాటుతాం


ఎగుడు దిగుడు క్రీడా ప్రాంగణంలోనే విద్యార్థులకు శిక్షణ

చిలకలూరిపేట మండలం రాజాపేటలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలుర)లో 380 మంది విద్యార్థులు 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ముచ్చటగా ఈ పాఠశాల పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధిస్తోంది. రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ సైతం ప్రతిభ చూపుతున్నారు. అయినా పాఠశాల మధ్యలో ఉన్న ఒకటిన్నర ఎకరాల క్రీడా ప్రాంగణం ఎగుడు దిగుడుగా ఉండటంతో విద్యార్థుల ఆటలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల జిల్లాస్థాయిలో 81 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. తమ క్రీడా ప్రాంగణాన్ని మట్టితో నింపి చదును చేస్తే రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి పాఠశాలకు పేరు తీసుకు వస్తామని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

కారణం లేకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తారా?


మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు, ఉద్యోగుల ధర్నా

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : కారణం చూపకుండా ఉద్యోగులను, కార్మికులను విధులకు రావద్దని చెప్పడం, పనిచేసిన కాలానికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ అన్నారు. స్థానిక పురపాలక సంఘంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన ఆందోళన ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని ఏ ప్రభుత్వం విధుల నుంచి తొలగించలేదని, గత మున్సిపల్ కమిషనర్, ఏఈలు విధులకు రావద్దని చెప్పారని, కారణం అడిగినా సమాధానం లేదని, అకారణంగా వారిని రోడ్డు పాలు చేస్తున్నారని చెప్పారు. ఇవన్నీ చూస్తుంటే రాజకీయంగా ఉద్యోగులు, కార్మికులపై కక్ష కట్టి విధుల నుంచి తొలగిస్తున్నట్లుగా ఉందని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

శాసనమండలి గౌరవాన్ని కాపాడుతాం


ఎన్టీఆర్, కోడెలకు విగ్రహాలకు నివాళి అర్పించిన తెదేపా నేతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : శాసనమండలి గౌరవాన్ని కాపాడడంతో పాటు పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తామని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జమీందార్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి నియోజకవర్గ పట్టభద్రుల సమావేశం నిర్వహించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు హాజరయ్యారు. ముందుగా తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావుకు నివాళి అర్పించారు. ఆలపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో శాసనమండలి సభ్యుల వ్యవహారశైలిని ప్రజలు చూశారన్నారు. జగన్‌కు అత్యధిక సీట్లలో అధికారం అప్పగిస్తే అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి పాలనకు ఆమోదంగా ఓట్లు వేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నేతలు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వనమా సాంబశివరావు, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ వాసికి తితిదే ఆహ్వానం

బెల్లంకొండ: బెల్లంకొండకు చెందిన ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ వెంకట ఫణికుమార్ శర్మకు తితిదే ఆహ్వానం అందింది. వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం జరగనున్న కల్పవృక్ష వాహన సేవలో ప్రత్యక్ష వ్యాఖ్యానం అందించడానికి ఆయన్ను ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు, పులివెందుల, హైదరాబాద్‌కు చెందిన పోస్టల్ ఉద్యోగులు ఆదివారం ఆయన్ని గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. మీరు పట్టించుకోవడం వల్లే ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న నియామకాలు దక్కాయని ఉద్యోగులు పెమ్మసానికి ధన్యవాదాలు తెలియజేసి సత్కరించారు. పెమ్మసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. సమస్యల్ని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఏ ప్రాంతమైనా మాదే

బహిరంగ ప్రదేశాల్లో మద్యం బాబుల విందులు

పాఠశాలలోనూ తిష్ట

చిలకలూరిపేట పట్టణం, గణపవరం, న్యూస్‌టుడే

ఖాళీ జాగా కనపడితే చాలు.. మద్యం ప్రియులు ఆసరాగా చేసుకుంటున్నారు. దీనికి పాఠశాలను కూడా వదలడం లేదు. నాదెండ్ల మండలం గణపవరంలోని శ్రీకెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం సెలవు రోజుల్లో మద్యం ప్రియులకు అడ్డాగా మారుతోంది. పాఠశాల చుట్టూ ప్రహరీ లేక ఆవరణ లోపలికి మద్యం ప్రియులు వచ్చి చెట్ల కింద, ఆవరణలో ఉన్న ట్యాంకు కింద కూర్చొని మద్యం తాగుతున్నారు. తినుబండారాలు, మద్యం సీసాలు, గ్లాసులు అక్కడే పడేస్తున్నారు. దీంతో పవిత్రంగా ఉండాల్సిన పాఠశాలను బార్‌గా మార్చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ చుట్టూ, పాఠశాల భవనం వెనకాల తాగి పడేసి ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి. చిలకలూరిపేట పట్టణంలో చెరువు రోడ్డుకు వెళ్లే దారిలో సింగ్‌నగర్ ప్రాంతంలో చెట్ల కింద కూర్చొని మద్యం తాగుతుండటంతో అటుగా వెళ్లేవారికి అసౌకర్యంగా మారుతోంది. కొందరు రోడ్డు మీదే ద్విచక్ర వాహనంపై మందు సీసాలు పెట్టుకుని తాగుతున్నారు. సీఆర్ కాలనీ శివారున ఖాళీ ప్రదేశాల్లో ఇలాగే చేస్తున్నారు. కొందరైతే పట్టణంలో డివైడర్‌పై కూర్చొని తాగుతున్నారు. గతంలో పట్టణంలో పోలీసులు కట్టడి చేసినా మళ్లీ పరిపాటిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో, బహిరంగంగా మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఆవరణలో మద్యం సీసాలు, గ్లాసులు


గణపవరం పాఠశాల ఆవరణలో ట్యాంకు కింద కూర్చొని మద్యం తాగుతూ..

రేషన్ బియ్యం స్వాధీనం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని గ్రామీణ పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. గ్రామీణ ఎస్సై కిశోర్ కథనం మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మండలంలోని పెట్లూరివారిపాలెం వద్ద తనిఖీలు చేస్తుండగా 80 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం యజమానిగా యడ్లపాడు మండలం కొండవీడుకు చెందిన షేక్ శిలార్, లారీ డ్రైవర్‌గా పాలే వినోద్‌కుమార్‌ను గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి బియ్యం తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

ప్రభుత్వ భూముల కబ్జా

ఇనుమెళ్లలో ఆక్రమణల పర్వం

ఈపూరు తహసీల్దారు కార్యాలయంలో రికార్డులు మాయం

న్యూస్‌టుడే, ఈపూరు, వినుకొండ

ఈపూరు మండలం ఇనుమెళ్లలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. ఇప్పటికే కొంతమంది వాటిని ఆక్రమించి పండ్ల తోటలు, ఇతర పంటలు సాగు చేపట్టారు. మరికొంత మంది భూమి పైకి అనుభవంలోకి రాకుండా పత్రాలు పెట్టి బ్యాంకు రుణాలు తీసుకున్నారు. గతంలో రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్న కొంతమంది ఇపుడు ప్రభుత్వ భూముల్లోకి చొరబడి చెట్లు తొలగించి.. బోర్లు వేసుకుని సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఖాతరు చేయడం లేదు.


ప్రభుత్వ భూములను సాగుకు అనుకూలంగా మార్చిన ఆక్రమణదారులు

❖ ఇనుమెళ్ల పరిధిలోని సర్వే నంబరు 504-15లో 381.97 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో సుమారు 50 ఎకరాలను ప్రభుత్వం కంకర క్రషర్లకు కేటాయించింది. మిగతావి ఖాళీగా ఉండగా కన్నేసిన అక్రమార్కులు రెండు దశాబ్దాలుగా వివిధ పద్ధతుల్లో వందల ఎకరాలు కబ్జా చేశారు. కొంతమంది భూస్వాములు వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రభుత్వ భూములను వశం చేసుకున్నారు. మొదట బడుగు బలహీనవర్గాలకు చెందిన వారిని ప్రభుత్వ భూములపైకి పంపి వాటిని ఆక్రమింపజేసి సాగుకు అనుకూలంగా మార్చాలని ప్రోత్సహిస్తారు. ఆ ఖర్చును భూస్వాములే భరిస్తారు. తర్వాత వారితో ఏదో ఒక పంట సాగు చేయిస్తారు. కొంత కాలం తర్వాత భూమి వారి నుంచి కొన్నట్లు అంగీకార పత్రం రాయించుకుంటారు. అనంతరం అధికారులను ప్రలోభపెట్టి ప్రభుత్వ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయించుకుంటారు. ఇలా చాలా భూమిని అక్రమార్కులు వశం చేసుకున్నారు. మరి కొంతమంది అధికారులను సంప్రదించి బేరాలు కుదుర్చుకున్నారు. కొంత విస్తీర్ణంలో భూమి ఎంపిక చేసుకుని అర్హులు కాకపోయినా డీకే పట్టాలు మంజూరు చేయించుకున్నారు. ఇంకొంతమంది అయితే ఏకంగా ఆన్‌లైన్ ఒన్ బీ అడంగల్ రికార్డుల్లో అక్రమంగా తమ పేర్లు నమోదు చేయించుకుని పట్టాదారు పాసు పుస్తకాలు పొంది బ్యాంకు రుణాలు తీసుకున్నారు.


ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రికార్డులు మాయం..: ఇనుమెళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూముల రికార్డులు ఈపూరు తహసీల్దారు కార్యాలయంలో మాయం అయ్యాయి. గతంలో పనిచేసిన రెవెన్యూ సిబ్బంది కొందరు తస్కరించి అక్రమార్కులకు అందజేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల్లో పండ్ల తోటలు సాగు చేసి పెద్ద మొత్తంలో బ్యాంకు రుణాలు పొందిన కొంత మంది రికార్డులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

విచారణ చేపడుతున్నాం.

ఇనుమెళ్లలో ప్రభుత్వ భూముల ఆక్రమణపైన విచారణ చేస్తున్నాం. ప్రస్తుతం కొంతమంది ప్రభుత్వ భూముల్లోకి చొరబడి పంటల సాగుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిసి ఆ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించాం. మా కార్యాలయంలో గ్రామ రికార్డులు లేకపోవడం వల్ల నరసరావుపేట ఆర్డీవో కార్యాలయం నుంచి తెప్పించి డీకే పట్టాదారుల వివరాలు సేకరిస్తున్నాం. వాస్తవ లబ్ధిదారుల వివరాలు నమోదు చేశాక మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను నిర్ధరిస్తాం. ఈ ప్రకారం ప్రభుత్వ భూముల్లో ఉన్న ఆక్రమణదారులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

-నళిని, తహసీల్దారు, ఈపూరు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 86/-.

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

బోనాలతో తరలివచ్చిన మహిళలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : విఠంరాజుపల్లి శాంతి ఆశ్రమం వద్ద హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. గురూజీ రాజ శ్యామల యాగం, కుంకుమ పూజ, 108 శ్రీ చక్ర కలశ పూజ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



బోనాలతో శాంతి ఆశ్రమానికి వస్తున్న మహిళలు

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండు

నూజెండ్ల, న్యూస్‌టుడే : ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ఆదివారం నిర్వహించారు. పరిశ్రమల పరిశీలన నిమిత్తం వినుకొండలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లారు. దుస్తుల డిజైన్, కంప్యూటర్‌పై మగ్గం పనితనం, ఎంబ్రాయిడరీ, చేతివృత్తుల తదితర చోట్ల విద్యార్థులకు వ్యాపారంపై అవగాహన కల్పించి వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయిని రాణి సుకన్య, శేషాంజనేయులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? తాతపూడి నుంచి మురికిపూడి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రావెల్‌తో నింపి చదును చేయగలరు.
✔ బర్మ్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపడతాం. **-రవీంద్ర, ఆర్‌అండ్‌బీ ఏఈ చిలకలూరిపేట**
– న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మొక్క నాటుతున్న చీఫ్ మేనేజర్ నాగేశ్వరరావు, ఆడిటర్ శ్రీరామ్ కమలాకర్ తదితరులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ నాగేశ్వరరావు, ఆడిటర్ శ్రీరామ్ కమలాకర్ అన్నారు. రొంపిచర్లలో ఆదివారం వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారం దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం నేతలు ఏర్పాటు చేసిన మొక్కలను వారు నాటారు. కార్యక్రమంలో రామబ్రహ్మానందరావు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజరు మల్లికార్జునరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు ఉన్నారు.

సేవాభావం.. యోగాతో చైతన్యం

❖ ఉచిత శిక్షణ ఇస్తున్న గురువులు ❖ విద్యార్థులకు వరం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే

ఆరోగ్యమే.. మహా భాగ్యమన్నారు పెద్దలు. ఉరుకుల..పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ మానసిక ఒత్తిడితో ఆరోగ్యం దారి తప్పుతోంది. వ్యాపారాలు, ఉద్యోగాల్లో తీరిక లేక ఆరోగ్యంపై శ్రద్ధ ఉండటం లేదు. యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మికంగా మనిషిని శుద్ధి చేస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అలాంటి యోగాలో విద్యార్థులు, యువకులకు, వృద్ధులకు శిక్షణ ఇస్తూ, ఏటా యోగా సేవా కేంద్రాలతో ఉచిత శిక్షణ తరగతులు అందిస్తున్నారు నరసరావుపేటకు చెందిన ఇద్దరు గురువులు. కొన్నేళ్లుగా ఉదయం, సాయంత్రం పలు పాఠశాలల్లో శిక్షణ ఇస్తూ.. విద్యార్థులు ఆరోగ్యం కాపాడుకునే మార్గంలో చైతన్యం పరుస్తున్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వారు పేర్కొంటున్నారు.

20 ఏళ్లుగా సేవలు



ఇరవై ఏళ్లుగా మా గురువు ఆకురాతి వెంకటేశ్వర్లు యోగి నేతృత్వంలో ఉచితంగా యోగా నేర్పిస్తున్నాం. 'మానవ సేవయే మాధవ సేవగా' భావించి ఊరూరా తిరుగుతూ 28 రోజులు ఉదయం 5 నుంచి 7 వరకు రెండు గంటలు శిక్షణ ఇస్తున్నా. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ద్వారా ఇప్పటికీ సుమారు 2.50 లక్షల మందికి పైగా తర్ఫీదునిచ్చాం. యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. యోగా సర్వరోగ నివారణిగా చెప్పవచ్చు.
- జల్లి శ్రీనివాసరావు, యోగా గురువు

అందరికీ ఆరోగ్యం పంచాలనే



అందరికీ ఆరోగ్యం పంచాలనేదే నా లక్ష్యం. గత ఎనిమిదేళ్లుగా నరసరావుపేట పట్టణంలో ఆనంద యోగశాల నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నా. ఏటా 28 రోజుల ఉచిత శిక్షణ ఉంటుంది. చిన్నతనం నుంచే యోగాపై ఆసక్తితో గురువు వేదాంతి మహర్షి స్ఫూర్తితో శిక్షణ పొందా. ఇందులో పీజీ చేయడానికి ఎందరో గురువుల వద్ద తర్ఫీదు పొందాను. మా విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. యోగాసనాలతో మానసిక సంతోషం, ఆరోగ్యం సిద్ధిస్తాయి.
- ఆర్.రామలింగమూర్తి, యోగా గురువు

దిగువకు నీరు చేరేదెలా?

☛ పెరుమాళ్లపల్లి మేజరు కాల్వలో అడ్డంకిగా నాచు ☛ రైతుల ఆవేదన

ఈపూరు, న్యూస్‌టుడే

మండలంలోని పెరుమాళ్లపల్లి మేజరు కాలువలో పేరుకున్న నాచు దిగువ భూముల రైతులకు శాపంగా మారింది. ఐదేళ్లుగా కాల్వల్లో నిర్వహణ పనులు చేపట్టక పూడిక పేరుకుంది. దీంతో నాచు పెరిగి దిగువ భూములకు సాగు నీరు వెళ్లడం లేదు. ఫలితంగా బోడెపూడివారి పాలెం, జోడేనుమించిపాలెం, కొండ్రముట్ల ఇంకా దిగువ భూముల రైతులు సాగు పొగాకు, మిర్చి పైర్లు నీళ్లు లేక వాడు ముఖం పడుతున్నాయి. నాచు పెరగడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ఎగువ ప్రాంతంలో నీళ్లు కట్టలు పొర్లి ప్రవహిస్తున్నాయి. నాచు కారణంగా ఎగువన కట్టలు పొర్లి నీళ్లు ప్రవహిస్తుండగా దిగువ భూములకు మాత్రం సాగు నీరు చేరడం లేదు.



దిగువ నాచు కారణంగా కాల్వ కట్టలపై నుంచి పొంగి పొర్లుతున్న నీళ్లు

సొంత ఖర్చులతో తొలగింపు: పెరుమాళ్లపల్లి మేజరు కాల్వ ఆధారంగా బోడెపూడివారి పాలెం రైతులు పొగాకు మిర్చి తదితర మెట్ట పైర్లు సాగు చేసుకున్నారు. రాత్రింబవళ్లు కష్ట పడి నీళ్లు పెట్టుకుంటే మూడు రోజులకు ఎకరం పొలం తడుస్తుంది. దిగువకు సాగరు నీళ్లు రాకపోవడంతో విసిగిపోయిన రైతులు రూ.40 వేలు వెచ్చించి వారం క్రితం పొక్లెయిన్‌తో కొద్దిగ వద్ద నాచు తొలగించుకున్నారు. కాల్వలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో పూర్తిగా తొలగించడం సాధ్యపడలేదు. ఈ మేరకు రైతులు ఎన్నెస్పీ అధికారులకు సమస్య విన్నవించారు. కాల్వకు రెండు రోజులు నీళ్లు నిలిపివేయాలని తాము నాచు తొలగించుకుంటామని కోరారు. వారు శనివారం కాల్వ తూము వద్దకు వచ్చి కాల్వ గేటు దించే ప్రయత్నం చేశారు. కానీ గేటు తుప్పు పట్టడంతో కిందకు పైకి కదలని పరిస్థితి. దీంతో వెనక్కి వెళ్లారు. నాచు తొలగించకపోతే దిగువ భూములకు నీళ్లు వెళ్లడం కష్టమని, నీళ్లు లేకపోతే తమ పైర్లు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత భవన నిర్మాణం కలేనా..?



పునాదులకే పరిమితమైన రైతు సేవా కేంద్రం

రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తాని చెప్పిన గత వైకాపా ప్రభుత్వం శాశ్వత భవన నిర్మాణాల నిర్మాణంలో విఫలమైంది. ఈ చిత్రంలో కనిపిస్తున్న పునాదులకే పరిమితమైన భవనం. ఇది మండలంలోని శానంపూడి ఉంది. రూ.23 లక్షలతో పనులు మొదలు పెట్టినా పునాదుల స్థాయిలో ఆగింది. గుత్తేదారు ప్రభుత్వం మారగానే పనులు నిలిపివేశాడు. ప్రస్తుతం అద్దె భవనంలో కేంద్రం నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి దీన్ని పూర్తి చేసి రైతులకు ఉపయోగపడేలా చేయాలని రైతులు కోరుతున్నారు.
- శానంపూడి (శావల్యాపురం), న్యూస్‌టుడే



పచ్చని తివాచి

విను'కొండ'పైన కోనేరు పచ్చని తివాచి పరిచినట్లు కనువిందు చేస్తోంది. నీటిపైన విసిరేసినట్లు మొక్కలు తేలియాడుతున్నాయి. ఇటీవల కొండపైన కురిసిన వాన నీరు కోనేరుకు చేరగా తొణికిసలాడుతోంది. రామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ నీటిని వినియోగిస్తారు.
-వినుకొండ, న్యూస్‌టుడే

ఉపాధి నిధులతో మారనున్న గ్రామాల దశ



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : పనిచేసే ప్రజా ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులతో గ్రామాల దశ మారబోతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. చిలకలూరిపేట మండలం పాత రాజాపేట, కొత్త రాజాపేటలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. రెండు గ్రామాల్లోనూ సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మించనున్న శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ గత ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభల నిర్వహణ ద్వారా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చరిత్ర సృష్టించారన్నారు. ఆ వినూత్న ప్రయత్నానికి ప్రపంచ రికార్డు కూడా దక్కిందన్నారు. ఆ రోజున మొత్తం రూ.4500 కోట్ల విలువైన ఉపాధి పనులకు గ్రామసభల్లో తీర్మానాలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, చిలకలూరిపేట, యడ్లపాడు మండలాల తెదేపా అధ్యక్షులు జవ్వాజి మదన్, సాయిబాబు, తెదేపా నాయకులు అంబటి సోంబాబు, చిన్నం రవికుమార్, గంజి శ్రీనివాసరావు, గోపాళం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జరీనా పాల్గొన్నారు.

మురుగు వ్యథ తీరేదెన్నడో..



ఇళ్ల ముందే మురుగు

నరసరావుపేట కోడెల శివప్రసాదరావు కాలనీలో మురుగు సమస్య తీరడం లేదు. అంతర్గత మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే మురుగు పారే దారి లేక ఇళ్ల ముందే నిలుస్తోంది. దీంతో దుర్గంధంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
- మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే



జడ్డావారిపాలెంలో శ్రీలలిత త్రిపురసుందరీదేవిగా



నూజెండ్ల : లక్ష్మీదేవి ఆలయంలో..



ముప్పాళ్ల శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి



విఠంరాజుపల్లిలో లలితా త్రిపుర సుందరీదేవిగా



గణపవరంలో లలితా త్రిపుర సుందరి దేవిగా



చిలకలూరిపేట రాజ్యలక్ష్మీదేవిగా



చిలకలూరిపేట వైష్ణవిదేవిగా



రొంపిచర్ల : మహేశ్వరి అలంకారంలో

కనుల పండువగా.. ఉత్సవాలు

దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా, గాయత్రీదేవిగా, లలితాదేవిగా పూజలు అందుకున్నారు. అమ్మవారికి సుప్రభాతం, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**



విప్పర్ల : లలిత త్రిపుర సుందరీ దేవిగా



నరసరావుపేట : పాతూరు భీమలింగేశ్వరాలయంలో ..



అరండల్‌పేటలో శాకంబరిగా



పాతూరులో అన్నపూర్ణగా



బొల్లాపల్లి : నాయుడుపాలెంలో...



రామిరెడ్డిపేటలో అన్నపూర్ణదేవిగా



పాతూరులో గాయత్రిగా



పసుమర్రులో గాయత్రీ దేవిగా

అవసరమే ఆసరాగా.. అవినీతి

పింఛను కోసం పుట్టిన తేదీల్లో మార్పులు
ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లల్లో కిరికిరీలు
అమాయకుల వద్ద రూ.వేలల్లో వసూళ్లు

వినుకొండ, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్ల ప్రకటనతో వాటిని దక్కించుకునేందుకు కొందరు అడ్డదారులు వెతుకుతున్నారు. పుట్టిన తేదీల్లో మార్పులకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లకు వెళుతున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొందరు ఆపరేటర్లు ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల నుంచి రూ.వేలు గుంజుతున్నారు. ఓటు కార్డు, పాన్‌కార్డులో వయసు ఎక్కువ ఉంటే దాన్ని ఆధారంగా చూపించి వేలిముద్ర తీసుకొని.. నెల తర్వాత ఇంటికి మారిన ఆధార్ కార్డు వస్తుందని చెప్పి పంపుతున్నారు.

సామాజిక పింఛను మంజూరుకు ముందు ఆధార్ చరిత్రను పరిగణలోకి తీసుకుంటారన్న విషయం తెలియక అమాయకులు అత్యాశతో డబ్బులు వదిలించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అర్హతున్న వారికి సామాజిక పింఛను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. దీంతో అర్హత లేకున్నా ఆర్థిక ప్రయోజనం పొందాలన్న తపనతో ఆధార్ కార్డులో వయసు పెంచుకునేందుకు యత్నిస్తున్నారు.

ఇవీ అర్హతలు: వృద్ధాప్య పింఛను కోసం ఆధార్‌కు ఫోన్ లింక్ అయి ఉండాలి. రేషన్ కార్డు, విద్యుత్తు బిల్లు, కులం, ఆదాయ ధ్రువపత్రంతో పాటు ఆధార్ చరిత్ర జత చేయాలి. వితంతు పింఛను కోసం పైన తెలిపిన పత్రాలతో పాటు భర్త మరణ ధ్రువపత్రం అదనంగా అందజేయాలి.

మార్పులు చేస్తే అనర్హత: పింఛను కోసం దరఖాస్తు చేసిన వారి ఆధార్ చరిత్ర పరిశీలించినప్పుడు అందులో వయసు మార్చినట్లు బయటపడుతుంది. అది సహేతుకం కానట్లయితే పింఛను దరఖాస్తు తిరస్కరిస్తారు. ఈ విషయాన్ని మభ్యపెట్టి ఆపరేటర్లు కొందరు డబ్బులు తీసుకొని మోసం చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

సదరం పత్రాల గుట్టు విప్పేదెప్పుడు?

జిల్లాలోని ఆరు మండలాలకు చెందిన 363 సదరం ధ్రువపత్రాల్లో లోపాలున్నాయన్న ఫిర్యాదులపై వాటి పునః పరిశీలనకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 31, సెప్టెంబరు 2, 4, 5 తేదీల్లో వినుకొండ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నప్పటికీ కొందర్ని గుంటూరు సమగ్ర ఆసుపత్రికి పంపారు. నెల గడిచినా ఇప్పటి వరకు వాటి ఫలితాలు వెల్లడించలేదు.

ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ చేస్తాం

వినుకొండ, న్యూస్‌టుడే : పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ బస్టాండు విస్తరించాల్సి ఉందని శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ- విజయవాడ మార్గంలో ఆదివారం కొత్తగా నాలుగు అద్దె బస్సులను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. త్వరలో రవాణా శాఖ మంత్రిని తీసుకొచ్చి బస్టాండ్ పరిస్థితి ఆయనకు చూపించి నిధులు తెస్తానన్నారు. గత ఐదేళ్లు డొక్కు బస్సులతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటి స్థానంలో కొత్తవి తిరుగుతున్నాయని తెలిపారు. వినుకొండ డిపోలో ఇప్పటి వరకు 25 ప్రారంభించామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జవ్వాజి నాగేశ్వరావు, ఇన్‌ఛార్జి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధనమ్మ, ఏఎంఎఫ్ సుగ్రీవుడు, కార్మిక సంఘ నాయకులు సాంబశివరావు, ఖాజా, విన్సెంట్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు

పిచ్చికుక్క స్వైర విహారం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : మండలంలోని తిమ్మాయిపాలెంలో శనివారం ఓ పిచ్చికుక్క పలువురిని గాయపరిచింది. ఇంట్లో ఉన్న రావెళ్ల వెంకాయమ్మపై దాడి చేయగా చేతికి తీవ్ర గాయాలయ్యాయి. మరి కొంత దూరంలో ఉన్న తోట రంగయ్య కాలు పట్టుకుని లాగింది. అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తున్న ఐదేళ్ల కొమిరి హరిహరణను కాలు పట్టి లాక్కెళుతుండగా అటుగా వస్తున్న బాలుడి తండ్రి చూసి కర్రతో కొట్టగా పారిపోయింది. వెళ్తూ సమీపంలో ఇంటి వెనుక ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారి కొమరిగిరి శివకుమార్‌ను వెనుక నుంచి మెడ పట్టుకొని విదిలించగా అతను ఎగిరిపడ్డాడు. దీంతో మెడ వెనుక రెండుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం మల్లవరపు ఏసుదాసును వెనుకగా వచ్చి కరిచింది. రావెళ్ల వెంకటేశ్వర్లు, అరిగెల బాలకోటమ్మల దూడలపై, సత్యం, బుజ్జికి చెందిన గేదెలపై దాడి చేసింది. చేసేది లేక ట్రాక్టర్‌తో తొక్కించి గ్రామస్థులు దాన్ని చంపేశారు. బాధితులను రైతు సంఘం నేత ముని వెంకటేశ్వర్లు, సీపీఎం నేతలు తిరుమల లక్ష్మి, రంజాన్‌బి, వెంకటప్పయ్య పరామర్శించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఈపూరు : ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసు సర్కిల్ పరిధిలోని మండలాల్లో మంజూరైన తొమ్మిది మద్యం దుకాణాలకు ఈపూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం మండలానికి 2, బొల్లాపల్లి మండలానికి 3, రొంపిచర్ల మండలానికి 4 చొప్పున మద్యం దుకాణాలు మంజూరు చేసిందని, ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

అంత్యక్రియలకు ఎన్ని అవస్థలో?

చిలకలూరిపేట పట్టణం, గణపవరం, న్యూస్‌టుడే

మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికకు వెళ్లేవారికి నరకం కనపడుతోంది. చిలకలూరిపేట పట్టణంలోని ఏఎంజీ పక్కన ఉన్న శ్మశాన వాటిక స్థలంలో కంపచెట్లు పెరిగాయి. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. చేతిపంపు తుప్పుపట్టి నీరు రావడం లేదు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ● శారద పాఠశాల పక్కన ఉన్న శ్మశానం ముళ్లచెట్లతో ఉంది. ఇటీవల దహనవాటికకు సంబంధించి ఒక ఇనుప పరికరం కూడా చోరీకి గురైంది. మోటారు స్విచ్‌బోర్డు పాడైంది. వాటితో పాటు వెంగళరెడ్డినగర్ ఓగేరువాగు పక్కన, బొందిపాలెంలో వంతెన పక్కన వాగులో, రాగన్నపాలెంలో శ్మశాన వాటికలు పిచ్చి చెట్లతో అసౌకర్యంగా మారాయి. నాదెండ్ల మండలం గణపవరం నుంచి వేలూరు వెళ్లే రోడ్డులోని చౌటిపాలెం శ్మశానవాటిక రోడ్డు కంటే బాగా గుంతలో ఉంది. ముఖద్వారం వద్దే కుంట ఏర్పడి నీరు నిల్వ ఉన్నాయి.



గణపవరం చౌటిపాలెం శ్మశానవాటిక ముఖద్వారం వద్ద గుంత

శ్మశానవాటికల్లో వసతుల కరవు



పట్టణంలోని ఏఎంజీ సంస్థ పక్కన ముళ్లచెట్ల మధ్య శ్మశాన వాటిక

● గణపవరం అంబేడ్కర్‌కాలనీ నుంచి చెరువుకు వెళ్లే రహదారిలో శ్మశానవాటికకు ప్రహరీ లేదు. ముళ్లచెట్లు మొలచి ఉన్నాయి. సంబంధిత అధికారులు వీటిని అభివృద్ధి పరిచి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు...ఇద్దరికి తీవ్రగాయాలు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలోని రొంపిచర్ల విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలో రోడ్డు దాటుతున్న ట్రాక్టర్‌ను కారు ఢీ కొట్టగా ట్రాక్టర్ డైవర్, కారులోని మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఈపూరు మండలం ఇనిమెళ్లకు చెందిన చల్లా అంజయ్య ఆదివారం నరసరావుపేటలో రోటావేటర్ కొని స్వగ్రామానికి బయలుదేరాడు. రొంపిచర్ల విద్యుత్తు ఉప కేంద్రం వద్ద రాష్ట్రీయ రహదారి దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు.. ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ట్రాక్టర్ రోడ్డుపైనే ఫల్టీ కొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ అంజయ్య కిందపడగా తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది. ముందు సీటులో ఉన్న మహిళలకు గాయాలయ్యాయి. కారులో చిన్నపిల్లలతో పాటు ఇద్దరు ఉన్నారు. బెలూన్స్ తెరుచుకోగా పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను పట్టణంలోని వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నవరప్పాడు వద్ద ఒకరికి..

రొంపిచర్ల : అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలోని అన్నవరప్పాడు వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడిని కారు ఢీ కొట్టగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన జంగం బాలయ్య ఆదివారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లే క్రమంలో రాష్ట్రీయ రహదారి దాటుతుండగా ఒంగోలు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. దీంతో బాలయ్య తలకు తీవ్రగాయమైంది. కారులోని వారు బంగోలు వైపు పారిపోతుండగా స్థానికులు బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద టోల్‌గేట్ సిబ్బందిని అప్రమత్తం చేయగా వారు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. బాలయ్యను 108లో పట్టణానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్తెనపల్లి

•సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల



అమ్మసన్నిధి భక్తులతో కిటకిట

దుర్గి, న్యూస్‌టుడే: పల్నాట ప్రసిద్ధిచెందిన శ్రీనిదానంపాటి అమ్మవారి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దసరా వేడుకల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు.

పల్లకీ సేవలో భక్తులు

చదరంగంతో మానసిక స్థైర్యం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మానసిక పరిణితికి చదరంగం దోహదం చేయడంతోపాటు మానసిక స్థైర్యాన్ని నింపుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం పట్టణంలోని కిడ్స్ పాఠశాల ఆవరణలో జరుగుతున్న ఆంధ్రా, తెలంగాణ స్థాయి చెస్ పోటీలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డితో కలిసి వీక్షించారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ నాయకులు బాలశౌరి, తాళ్లపల్లి మాజీ సర్పంచి బ్రహ్మానాయుడు కుటుంబాలను వారిద్దరూ పరామర్శించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ నాయకుడు బాబూఖాన్ ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? గ్రామంలో మురుగునీటి వ్యవస్థ సరిగ్గా లేదు. దుర్వాసన, దోమలతో విషజ్వరాల బారిన పడుతున్నాం. **- రమేష్, శివాలింగాపురం**

✔ త్వరలో గ్రామ వీధుల్లోని మురుగు కాలువల్లో పూడిక తీయిస్తాం. **- చంద్రం, పంచాయతీ కార్యదర్శి**

? గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- అంకమ్మ, ఎర్రబాలెం**

✔ వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- చంద్రం, కార్యదర్శి.**

– న్యూస్‌టుడే, వెల్దుర్తి

? గురజాలలోని వీరన్నబావి సెంటర్ వద్ద విద్యుత్తు స్తంభాన్ని పిచ్చి మొక్కలు అల్లుకుపోయాయి గాలి వీచినప్పుడు మంటలు వ్యాపిస్తున్నాయి. **- స్థానికులు**

✔ఈ విషయం ఇన్‌ఛార్జి ఏఈ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలను తొలగించారు.

– న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ



రహదారిపై గుంతల పూడ్చివేత

స్పందనకు వందనం

అచ్చంపేట, న్యూస్‌టుడే: అచ్చంపేట-మాదిపాడు మార్గంలో అచ్చంపేటలోని రాగి చెట్టు వద్ద ఏర్పడిన గుంతలను ఆదివారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచనల మేరకు స్థానిక తెదేపా నాయకుడు వెనిగండ్ల కోటయ్య పూడ్చించారు. గత నెల 27న 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన సమస్యకు స్పందించారు. పీహెచ్‌సీ వెనుక భాగంలో ఉన్న మురుగును తొలగించారు. అక్కడ కల్వర్టు ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అంచనాలు తయారు చేస్తుందని కోటయ్య తెలిపారు.

చేపల వేట ఆగింది.. వేదన మిగిలింది

ఆదుకోవాలని మత్స్యకారుల వేడుకోలు


అచ్చంపేట, న్యూస్‌టుడే

గత నెల వరదలు, వర్షాలకు కృష్ణానది తీరం ఉప్పొంగింది. మత్స్యకారుల జీవనాధారమైన పడవలు, వలలు దెబ్బతిన్నాయి. వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తమను ఆదుకోవాలంటూ మత్స్యకార కుటుంబాలు వేడుకుంటున్నాయి. దాచేపల్లి, అచ్చంపేట, అమరావతి మండలంలోని కృష్ణాతీరం వెంబటి మత్స్యకారులకు చేపల వేట జీవనాధారం. అచ్చంపేట మండలంలోని తాడువాయి, కోగంటివారిపాలెం, కోనూరు, చల్లగరిగ తదితర గ్రామాల్లో వంద మంది మత్స్యకారులు చేపలు విక్రయిస్తూ కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. వరదలతో నది ఒడ్డున ఉంచిన పడవలు, వలలు కొట్టుకుపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నది ప్రవాహం అధికంగా ఉండటంతో చేపల వేట సాగడం లేదని వాపోతున్నారు. జీవనోపాధికి అవసరమైన పడవలు, వలలు సరఫరా చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



తాడువాయి రేవులో దెబ్బతిన్న పడవ

నావ కొట్టుకుపోయింది..



అర్ధరాత్రి ప్రళయంలా వరద వచ్చింది. ఇంత వరకు ఇంతటి వరద చూడలేదు. వర్షం ఎక్కువగా ఉండటంతో నావలను ఒడ్డుకు చేర్చుకోలేకపోయాం. పడవల్లోని నీళ్లు తోడుకోలేకపోయాం. నావ ఒకటి వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పడవల్లో ఉంచిన వలల మూటలు నదిలో కలిసిపోయాయి. మనుషులం మాత్రమే మిగిలాం.
- నరసింహామూర్తి, మత్స్యకారుడు, తాడువాయి



చిరిగిన వలలకు మరమ్మతులు చేస్తున్న మత్స్యకార కుటుంబం

పడవ ధ్వంసం



నది ప్రవాహం ధాటికి పడవ పుష్కరఘాట్ దిమ్మెకు తగిలి పగిలిపోయింది. తిరగబడింది. మరమ్మతులకు కూడా పనికిరాకుండా పోయింది. ఏం చేయాలో పాలుపోవటం లేదు. మా ఊరిలో 30 కుటుంబాలకు పనులు లేకుండా పోయాయి. గత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం అందలేదు. నదిలో రెండేళ్లుగా చేప పిల్లలు వదలడం లేదు. లోతు తక్కువగా ఉండటంతో అవి కొట్టుకుపోతున్నాయి.
- సత్యనారాయణ, మత్స్యకారుడు, తాడువాయి

అదుపు తప్పితే.. ముప్పు తప్పదు



ఆటోపై కూర్చొని ప్రయాణిస్తూ..

ఆటోల్లో కూలీలను పరిమితికి మించి తరలిస్తున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో విద్యార్థులు సైతం పొలంబాట పట్టారు. ఆటో లోపలు, పైభాగంలోనూ కూర్చోబెట్టి ఆటో చోదకులు నడుపుతున్నారు. నిత్యం మాచర్ల నుంచి మండాది మీదుగా పలు గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయి. ఏమాత్రం అదుపు తప్పినా పెనుప్రమాదం తప్పదు. పోలీసుల నిఘా కొరవడటంతోనే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

- న్యూస్‌టుడే, వెల్దుర్తి











అమరావతి: అమరేశ్వరాలయంలో అన్నపూర్ణదేవిగా బాలచాముండికా | దాచేపల్లి: వీర్ల అంకమ్మతల్లి | సత్తెనపల్లి గ్రామీణ: కొమెరపూడిలో.. | సత్తెనపల్లి గ్రామీణ: పెదమక్కెనలో.. | మోర్జంపాడు: బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో.. | మాచవరం: శివాలయంలో అన్నపూర్ణదేవిగా.. | బెల్లంకొండలో లలిత పరమేశ్వరిగా.. | పిడుగురాళ్ల: గుత్తికొండ బిలంలో రాజరాజేశ్వరిదేవి | పిడుగురాళ్ల: బ్రహ్మంగారి గుడిలో..



గురజాల పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో..



పిడుగురాళ్ల: కనకదుర్గమ్మ

చూసిన కనులదే భాగ్యం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అన్ని ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై పూజలు చేశారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **- న్యూస్‌టుడే, బృందం**



సత్తెనపల్లి: కొత్తపేటలో అన్నదానం ప్రారంభిస్తున్న డీఎస్పీ హనుమంతరావు



మాచర్ల: గౌరీదేవిగా వాసవీకన్యకా పరమేశ్వరి











పిడుగురాళ్ల: గంగమ్మ గుడిలో.. | కారంపూడిలో అంకాళమ్మ | పెదకూరపాడు: లింగంగుంట్ల శివాలయంలో.. | పెదకూరపాడులో.. | సత్తెనపల్లి: లలితాత్రిపుర సుందరిదేవిగా వాసవీ మాత | సత్తెనపల్లి: నీలంపాటి శ్రీలక్ష్మి | సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో | అచ్చంపేట సీతారామస్వామి ఆలయంలో.. | క్రోసూరు కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో..



కొండకు వెళ్లి వస్తున్న పర్యాటకులు

నాగార్జునకొండలో సందడి

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు వివిధ లాంచీల్లో వెళ్లి పర్యాటకులు బుద్ధుని ప్రతిమలు, రాతి పరికరాలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాలగట్టు, బోధివృక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేధ యజ్ఞశాల, రంగనాథస్వామి దేవాలయం వీక్షించారు. ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం లంచీల ద్వారా రూ.90,450 ఆదాయం సమకూరినట్లు లాంచీస్టేషన్ అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పట్టభద్రుల ఓటు నమోదుకు చొరవ చూపండి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న గుంటూరు.. కృష్ణా పట్టభద్రుల ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రుల ఓటు నమోదుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు చొరవ చూపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని ప్రజావేదికలో పట్టభద్రుల ఎన్నికపై పార్టీ శ్రేణులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే యువత భవితకు ఎన్నో మార్గాలు చూపించిందన్నారు. కొన్ని రోజుల్లోనే ఉద్యోగ విప్లవం రానున్నట్లు తెలిపారు.

నేడు ప్రజా దర్బార్

అమరావతి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల సత్కర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమం సోమవారం అమరావతి మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ శివపార్వతి తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

ఎప్పుడు కూలుతుందో..?



శిథిల వంతెనపై నుంచి వస్తున్న ఇసుక లారీ

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతి - విజయవాడ మార్గంలో పెదమద్దూరు వద్ద వంతెన కుంగిపోతోంది. గత నెల వచ్చిన భారీ వరదల కారణంగా వంతెన పూర్తిగా దెబ్బతింది. దీనిపై భారీ వాహనాలు ప్రయాణిస్తే ప్రమాదమని అధికారులు హెచ్చరించారు. విజయవాడ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను పెదమద్దూరు వద్దే నిలిపేస్తున్నారు. ఇసుక లారీలు మాత్రం యథేచ్ఛగా తిరుగుతుండటంతో ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఈ వంతెన కూలితే అమరావతి-విజయవాడ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. మరోవైపు కొత్త వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

60 ఏళ్ల వంతెన: పెదమద్దూరు వాగుపై 60 ఏళ్ల కిందట గ్రామస్థులు వాగు దాటేందుకు వంతెన స్వయంగా నిర్మించుకున్నారు. ఇప్పుడు ఆ వంతెన శిథిలావస్థకు చేరింది. ఇటీవల వైకుంఠపురం ఇసుక రీచ్ కారణంగా 50 నుంచి 60 టన్నుల బరువుగల ఇసుక లారీలు తిరుగుతుండటంతో పూర్తిగా దెబ్బతింది. కొత్త వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులను అడగ్గా ప్రభుత్వం మారడంతో గుత్తేదారు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

రోడ్డు కోత.. రాకపోకలకు వెత



పెదమక్కెన గ్రామ సమీపంలో నెలరోజుల కిందట వర్షాలకు గ్రావెల్ రహదారి అనేకచోట్ల కందకంలోకి కుంగిపోయింది. ఒక చోట భారీ కోతకు గురైంది. గ్రామం నుంచి సత్తెనపల్లి-అమరావతి ప్రధాన రహదారికి, పంట పొలాలకు స్థానికులు రాకపోకలు సాగించే దగ్గరి మార్గమిది. ట్రాక్టర్లు, కూలీల ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. ప్రాధాన్యత సంతరించుకున్న ఈ రోడ్డు కోత పడటంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారికి మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ**

తెలంగాణ మద్యం పట్టివేత

దాచేపల్లి, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ నుంచి పిడుగురాళ్ల వైపు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై పెద్ద సంచితో వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో వారిని వెంబడించారు. గమనించిన దుండగులు దాచేపల్లి పట్టణ శివారులో జాతీయ రహదారిపై మద్యం సీసాలతో ఉన్న సంచిని పడేసి పరారయ్యారు. సంచిలో రూ.24150 విలువచేసే 145 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.

నేటి నుంచి అయ్యప్పలకు అన్నదానం

గురజాల: గురజాల ముక్కంటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి అయ్యప్ప, సర్వ మాలధారులకు సద్ది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ అవకాశాన్ని మాలధారులు వినియోగించుకోవాలని కోరారు.



ఒప్పిచర్లలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

పల్లెల నుంచే అభివృద్ధికి శ్రీకారం

కారంపూడి: పల్లెల నుంచి మొదలు పెట్టి రాష్ట్ర స్థాయిలో తెదేపా మార్కు అభివృద్ధిని చూపుతామని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం మండలంలోని పేటసన్నెగండ్ల, కారంపూడి, ఒప్పిచర్ల గ్రామాల్లో రూ.30 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డితో కలిసి భూమిపూజ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. తొలుత కారంపూడిలోని సుద్దగుంతల కాలనీలో నిర్మించిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గురుకుల పాఠశాలలో నాబార్డు నిధులు రూ.2 కోట్లతో నిర్మించిన భవనాన్ని వారు ప్రారంభించారు. నరమాలపాడులో ఎన్టీఆర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి నాగిరెడ్డి, పరిటాల రవి విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు.

ఆదర్శ పాఠశాలలకు మంచి రోజులు



దేచవరంలోని ఏపీ ఆదర్శ పాఠశాల

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: బాలికల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. బడిమానేసిన బాలికల్ని తిరిగి బడిబాట పట్టించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు నడుపుతోంది. ఉమ్మడి జిల్లాలో 24 కేజీబీవీలు ఏర్పాటు కాగా.. అన్ని పల్నాడు జిల్లాలోనే ఉండటం విశేషం. వీటితో పాటు ఏపీ ఆదర్శ పాఠశాలలను టైప్-4 కేజీబీవీలుగా గుర్తించింది. వీటిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు బోధనకు విద్యార్థినులకు ఉచిత వసతి, పౌష్టికాహారాన్ని అందించనున్నారు. జిల్లాలో నాదెండ్ల, చీకటిగలపాలెం (వినుకొండ), విప్పర్లరెడ్డిపాలెం (రొంపిచర్ల), దేచవరం (నకరికల్లు), దాచేపల్లి, నూజెండ్ల, క్రోసూరు, గురజాల, దుర్గి, బొల్లాపల్లి, ఈపూరు, కండ్లగుంట (వెల్దుర్తి), కారంపూడి, జెట్టిపాలెం (రెంటచింతల)లో ఏపీ ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా 10 చోట్ల వసతి గృహాలు ఉన్నాయి. ఈపూరు, కండ్లగుంట, జెట్టిపాలెం, దుర్గిల ఏపీ ఆదర్శ పాఠశాలలకు వసతిగృహాలు లేవు. వాటిని టైప్-4 కేజీబీవీలుగా గుర్తించారు. 10 టైప్-4 కేజీబీవీలకు ఒక్కో విద్యాలయానికి ఒకరు చొప్పున 10 పార్ట్‌టైమ్ టీచర్ల పోస్టులు కొత్తగా మంజూరయ్యాయి. అదేవిధంగా ఖాళీగా ఉన్న నాలుగు వార్డెన్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు వెలుబడ్డాయి.

ఆటో ఢీకొని యువకుడి మృతి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గోళ్లపాడు ఎస్టీ కాలనీ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై సోమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన అవివాహితుడు విద్యాసాగర్(31) లలిత జ్యూయలర్స్, నరసరావుపేటలో సేల్స్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. గోళ్లపాడు ఎస్టీ కాలనీ సమీపంలో ట్రాలీ ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో నరసరావుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు.

పురుగుమందు తాగి గుర్తుతెలియని మహిళ..

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పురుగు మందు తాగి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన ఖమ్మంపాడులోని కుడికాలువ కట్ట వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణ వివరాల ప్రకారం గుర్తు తెలియని మహిళ కుడి కాలువపై పడి ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు 108కి సమాచారం ఇచ్చారు. వారు మాచర్ల ప్రభుత్వాసుపత్రికి ఆమెను తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వైకాపా కార్యకర్తకు జగన్ పరామర్శ

గురజాల: తేలుకుట్ల గ్రామానికి చెందిన నాగరాజు అనే కార్యకర్తను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. ఇటీవల నాగరాజుపై దాడి జరగడంతో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయన మాట్లాడిన అనంతరం జగన్‌కు ఫోన్ చేయడంతో ఆయన కూడా పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇస్తూ త్వరలో గురజాలకు వస్తానని చెప్పినట్లు సమాచారం.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

దాచేపల్లి, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం నడికూడి జంక్షన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ నుంచి చెన్నై వెళుతున్న చెన్నై సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రాత్రి 8.30 గంటల సమయంలో నడికూడి స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడిని ఢీకొంది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు 60-65 మధ్య ఉంటుందని, తెల్లచొక్కా, తెల్ల లుంగీ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పరాయి పంచన అంగన్‌వాడీ కేంద్రం

పరస (పెదకూరపాడు), న్యూస్‌టుడే: పెదకూరపాడు మండలం పరస అంగన్‌వాడీ కేంద్రం భవనం రెండేళ్ల కిందట నిర్మించారు. నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో ప్రారంభానికి నోచుకోవటం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరాయి పంచన ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల భవనం పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. నూతన భవనం తలుపులు, గుమ్మాలు, కిటికీలు ఒక్కొక్కటిగా పాడైపోతున్నాయి. ఆకతాయిలు కిటికీ అద్దాలు, ఫ్లోరింగ్ పలకలు పగులగొట్టారు. భవనం తెరిపించాలని అంగన్‌వాడీ కార్యకర్త, గ్రామ పెద్దలు సోమవారం ఎంపీడీఓ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందించారు.



ఇరుకు గదిలో చిన్నారులకు బోధన